సాక్షి శ్రీకాకుళం

బుధవారం : 25 : జూన్ : 2025



ఎన్నాళ్లీ ఎదురుచూపులు

ఆఫ్‌షోర్ నిర్వాసితులు పరిహారం కోసం ఎదురుచూస్తున్నారు. 132 కుటుంబాలు ఇలా నిరీక్షిస్తున్నాయి.

- 8లో



సారా స్థావరాలపై దాడులు

సారా స్థావరాలపై దాడులు చేశారు. 1520 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు.

- 8లో

విధుల్లోకి బదిలీ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లావ్యాప్తంగా ఇటీవల 221 మంది పోలీసులు బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, పీసీలకు రిలీవ్ ఆర్డర్‌లు సోమవారం రాత్రి ఇవ్వడంతో కొందరు మంగళవారమే విధులకు హాజరయ్యారు. మరికొందరు అమావాస్య నేపథ్యంలో బుధ, గురువారాల్లో విధులకు హాజరవుతున్నారు. శ్రీకాకుళం వన్‌టౌన్, టూ టౌన్, రూరల్, గార పోలీస్ స్టేషన్ల పరిధిలో 33 మంది కానిస్టేబుళ్లు, ఓ ఏఎస్ఐ రిలీవ్ అయినవారిలో ఉన్నారు.

న్యూస్‌రీల్

బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తించేలా..

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం మొద్దునిద్రను వీడింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూలై 12 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ–సమగ్ర శిక్షా అభియాన్ నిర్ణయించింది. అర్హత కలిగిన 6 నుంచి 14 ఏళ్ల పిల్లలందర్నీ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. డ్రాప్ బాక్సుల్లో, బడి బయట ఉండే పిల్లల్ని గుర్తించి వారందరూ బడిలో ఉండేలా చూడాలని తెలిపింది. జిల్లాలో బడి బయట ఉన్న పిల్లల్ని గుర్తించి బడులకు చేరువ చేసేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని సమగ్రశిక్ష ఏపీసీ డాక్టర్ ఎస్.శశిభూషణ్ పేర్కొన్నారు.

శ్రీముఖలింగం హుండీ ఆదాయం రూ.3.32 లక్షలు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న అర్చకులు, భక్తులు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో గడిచిన 112 రోజులకు గాను హుండీ ఆదాయం రూ.3,32,883 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. పర్యవేక్షణ అధికారి ఆమదాలవలస గ్రూప్ టెంపుల్ అధికారి టి.రవితోపాటు కొమనాపల్లి సత్యసాయి భజన మండలి అధ్యక్షులు పైడిశెట్టి వెంకటరమణ, అర్చకులు వెంకటాచలం, ధనాల స్వామి,భక్తులు పాల్గొన్నారు.

'ఆ భూములు పేదలకే చెందాలి'



భూముల్లో విత్తనాలు వేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘు నాయకులు

బూర్జ: పేదల సాగులో ఉన్న భూములు పేదలకే చెందాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలో గల అన్నంపేట గ్రామ రెవెన్యూ పరిధిలో గల వ్యవసాయ భూములను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 70 ఏళ్లుగా 25 దళిత, బలహీన వర్గాలకు చెందిన కుటుంబాలు సాగు చేస్తున్న భూములు వారికే చెందే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ ప్రాంతంలో థర్మల్ పవర్ ప్లాంట్ వస్తుందనే పేరుతో విశాఖపట్టణానికి చెందిన మంగపల్లి సూర్యప్రకాశరావు ఇక్కడ ఉన్న నాయకుల అండదండలతో ఈ సాగులో ఉన్న భూములు తొలగించి కోట్ల రూపాయలకు అమ్ముకోడానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. బాధితులంతా జిల్లా వ్యవసా య కార్మిక సంఘ కార్యదర్శి గంగరాపు సింహాచలంను సంప్రదించడంతో గడచిన నెల రోజుల నుంచి పెద్ద ఎత్తున పోరాటాలు చేసి, ఏరువాక కార్యక్రమం చేపట్టి విత్తనాలు వేశా రు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి గంగరాపు సింహాచలం, మండలనాయకులు అప్పలనాయుడు, మామిడి కిరణ్, స్థానికులు, బలహీన వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

మార్గం.. దుర్మార్గం



జిల్లా కేంద్రంలోని డీసీసీబీ కాలనీ రోడ్డు ఇది. చిన్నపాటి చినుకులకే ఈ దారి ఇలా గోదారిలా మారుతుంది. కాలనీవాసులు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా.. పన్నుల వసూళ్లపై కార్పొరేషన్ అధికారులు చూపించిన శ్రద్ధ దారి బాగుచేయడంపై చూపలేదు. – శ్రీకాకుళం పీఎన్‌కాలనీ



బూర్జ మండలం నారాయణపురం గ్రామం రహదారి ఇది. కాఖండ్యాం ఇసుక ర్యాంపు నుంచి, అలాగే సంతకవిటి మండలం తామరాపల్లి ఇసుక ర్యాంపు నుండి నారాయణపురం నుండి చీడివలస, కొల్లివలస గ్రామాల మీదుగా ఇసుక లారీలు, టిప్పర్లు తిరిగీ తిరిగీ దారిని ఇలా అధ్వానంగా మార్చేశాయి. వానల్లో ఇటుగా తిరగడానికి భయమేస్తోందని స్థానికులంటున్నారు.

– బూర్జ

ముక్కలు.. హైటెక్కులు



సిక్కోలుకు కొత్త జాడ్యం పట్టుకుంది. 'పేకాట పాపారావు'లు ఎక్కడికక్కడ ముక్కలు కలుపుతూ ఆస్తులు కరిగించేస్తున్నారు. మొన్నటికి మొన్న ఓ ప్రముఖ వైద్యుడు, జనసేన నాయకుడు జూద శిబిరం నడుపుతూ దొరికిపోయారు. నిన్నటికి నిన్న నగరంలో ఓ పేరున్న టీడీపీ నాయకుడు ఇలాగే పట్టుబడ్డాడు. నరసన్నపేట, టెక్కలి, కాశీబుగ్గల్లో సైతం ఇదే దందా నడుస్తోంది. సమాజంలో పేరు, పలుకుబడి ఉన్న వారే ఈ శిబిరాలను నడుపుతుండడం గమనార్హం. ఆన్‌లైన్ పేమెంట్లతో, ప్రత్యేక కోడ్ లాంగ్వేజీతో జిల్లాలో పేకాట శిబిరాలు నిర్వహిస్తుండడం విస్తుగొలుపుతోంది.

- జిల్లాలో పెరుగుతున్న జూద శిబిరాలు
- ఆన్‌లైన్ పేమెంట్‌లతో కొత్త పంథాలో పేకాట శిబిరాలు
- నిర్వాహకులంతా ప్రముఖులే
- ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ :

అందరూ కలుసుకునేలా ఓ ఇల్లు.. లోపల ఏం జరిగినా రహస్యంగా ఉండేలా ఏర్పాట్లు.. కరెన్సీ నోట్లతో సంబంధం లేకుండా లావాదేవీలు.. బయట వ్యక్తులకు అర్థం కాకుండా ప్రత్యేక సంజ్ఞలతో ఆదేశాలు.. వెరసి సిక్కోలు జూద శిబిరంలా మారుతోంది. పెడ దోవన పట్టొద్దని చెప్పాల్సిన పెద్దలే జిల్లాలో ఈ జూద శిబిరాలు నిర్వహిస్తుండడం గమనార్హం. జిల్లాకేంద్రంలో ఏకంగా రాజకీయ నాయకులే శిబిరాలు నడుపుతుండటం, అదీ తమ తమ నివాసగృహాల్లోనే బంధువులు, సిండికేట్ ముసుగులో నడుపుతుండటం మరింత చర్చనీయాంశంగా మారింది. మొన్నటికి మొన్న ఓ ప్రముఖ వైద్యుడు, జనసేన నాయకుడు ఎచ్చెర్ల పరిధి గెస్ట్ హౌస్‌లోనే నడుపుతూ దొరికిపోయాడు. నిన్నటికి నిన్న నగరంలో పేరున్న టీడీపీ నాయకుడు మరి కొందరితో రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిపోయారు. వీరే కాక నరసన్నపేట, టెక్కలి, కాశీబుగ్గల్లో సైతం పేరున్న ప్రముఖులే పట్టుబడటంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి నేతృత్వంలోని ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు గట్టిగా పనిచేస్తున్నాయి. కానీ పోలీసులకు దీటుగా జూద నిర్వాహకులు సైతం రోజుకో పంథాతో.. ఆశ్చర్యగొలిపే రీతిలో శిబిరాలు నడిపిస్తున్నారు.

పంథా మార్చేశారు..

ఇది వరకు పేకాట, ఇతర బెట్టింగ్‌లకు పాల్పడేవారు శిబిరాలకు వెళ్లేటప్పుడు ద్విచక్ర వాహనాలపై, కార్లపై వెళ్లేవారు. ఇప్పుడలా లేదు. నిర్వాహకులు ముందుగా చెప్పిన ప్రకారం ఓ జంక్షన్ వరకు సింగిల్‌గా వచ్చేయడం, అక్కడే నిర్వాహకుని అసిస్టెంట్ బైక్‌తో సిద్ధంగా ఉండి ఒకరిద్దరిని ఎక్కించుకుని వెళ్లి శిబిరంపై డ్రాప్ చేసి వదిలేయడం చేస్తున్నారు. ఇలా ఇద్దరు ముగ్గురు అసిస్టెంట్లు ఉంటారు. వీరికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి ఇచ్చేందుకు ఒప్పందం కుదిరి ఉంటుంది.

ల్యాప్‌టాప్‌లు, ఆండ్రాయిడ్ ఫోన్లు, భారీగా నగదు సైతం పట్టుకెళ్లడం లేదు. పేకాట డెన్‌లన్నీ మార్చేశారు. ఎవరో ఒకరింటి దగ్గర నిర్వహించుకోవడం మొదలుపెట్టారు. పోలీసులు గట్టిగా అడిగితే నాయకుల పేరు చెప్పి తిరగబడేందుకు కూడా సిద్ధమవుతున్నారు. అయినప్పటికీ పోలీసులు జీపులెక్కిస్తే ప్రసన్నం చేసుకోవడానికి మీరు గ్రేట్ అంటూ తమ నాయకుల సిఫార్సులతో ప్రమోషన్లు, నచ్చిన చోట పోస్టింగులిప్పిస్తామంటూ బేరాలు పెడుతున్నారు.

పేకాట ఇంజినీర్లు అనాలేమో..

- జూదంలో ప్లస్ 10 కేఆర్.. ప్లస్ అంటే ఆటలో గెలిచినట్లు టెన్ అంటే పదివేలు, కేఆర్ అంటే కరాటే రాంబాబుతో. అంటే రూ.పదివేలు కరాటే రాంబాబు నుంచి రావాలని అర్థం.
- మైనస్ 20 డీఎన్ అంటే.. రూ.20 వేలు దట్టి నాగేశ్వరరావుకు ఇవ్వాలని అర్థం. 1/20 అంటే ఒకటో గేమ్‌లో 20 వేలు రావాలి.
- 3/15 అంటే మూడో గేమ్‌లో రూ.15 వేలు ఇవ్వాలి.. పక్కనే కృష్ణారావుకి ఇవ్వాలి అంటే కేఆర్ అని రాస్తారు. అదే రాంబాబు అంటే ఆర్‌బీ, కిశోర్ అంటే కేవ ఇలా.. ఇవన్నీ కీప్యాడ్ మొబైల్ లేదా చిన్న స్లిప్పుల్లో గాని, చిన్న సైజు బుక్కుల్లో లేదంటే చేతులమీద, కాళ్లు, తొడలమీద రాసేస్తుంటారు.
- మొన్న ఆదివారం జలుమూరు, రణస్థలం, గార జొన్నలపాడు, వన్‌టౌన్ లిమిట్స్‌లో పోలీసులకు ఇదే పరిస్థితి ఎదురైంది. తక్కువ మొత్తంలో నగదు పట్టుబడటం, ఫోన్లు, ల్యాప్‌ట్యాప్‌లు, బుక్లు దొరక్కపోవడం ఒకింత వింతనిపించింది.

ప్రత్యేకత చాటుతున్న టాస్క్‌ఫోర్స్



ఎస్పీ నేతృత్వంలోని స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇటీవలి కాలంలో దాదాపు 250 నుంచి 300 వరకు పేకాట, బెట్టింగ్ రైడ్‌లు చేసి తమ ప్రత్యేకతను చాటుకున్నాయి. స్పష్టమైన సమాచారంతో మాటువేసి ఎంతటివారినైనా వదలిపెట్టడం లేదు. కానీ ఇలా పట్టుకోవడమే కాదు అక్కడక్కడా వదిలేయడాలు కూడా గోప్యంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో అధికార పార్టీ నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖుల ముసుగులో అసాంఘిక కార్యకలాపాలు చేస్తే ఊరుకునేది లేదని ఎస్పీ హెచ్చరిస్తున్నారు.

గురువుకు అందని భత్యం

- 10వ తరగతి ఇన్విజిలేషన్, మూల్యాంకనం రెమ్యూనరేషన్ జమ కాని వైనం
- గత ఏడాది రెమ్యూనరేషన్ ఈ ఏడాది జమ

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ నేటికీ జమ చేయలేదు. దీంతో ఉపాధ్యాయ వర్గాలు ఆందోళనకు సిద్ధపడుతున్నాయి. 10వ తరగతి పరీక్షలు జరుగుతున్నప్పుడు ఇన్విజిలేషన్, పర్యవేక్షణ జరిపిన ఉపాధ్యాయులు, అధికారులతో పాటు మూల్యాంకనం సందర్భంగా పేపర్లు దిద్దిన ఉపాధ్యాయులు, ఇతర విధులు నిర్వహించిన విద్యాశాఖాధికారులకు రెమ్యూనరేషన్ చెల్లించాల్సి ఉంది. 10వ తరగతి పరీక్షలు ముగిసి సుమారు 4నెలలు కావస్తున్నా నేటికీ ఆ రెమ్యూనరేషన్ ఉపాధ్యాయులకు చెల్లించలేదు. అలాగే గత ఏడాది జరిగిన 10వ తరగతి పరీక్షలకు సంబంధించిన రెమ్యూనరేషన్ కూడా ఈ ఏడాది మార్చి నెలలో చెల్లించడం గమనార్హం. ఈ ఏడాది కూడా ఏడాది ఆలస్యంగా చెల్లిస్తారా అని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తూ ఉద్యమానికి సిద్ధపడుతున్నారు. ఏడాది ఆలస్యంగా చెల్లింపులు చేయడం సిగ్గుచేటని డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు తెలిపారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనకు సిద్ధపడతామని ప్రకటించారు.

– శ్రీకాకుళం

మహిళల టాయిలెట్‌కు తాళాలు

జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్యారోగ్య శాఖాధి కారి కార్యాలయంలో మహిళా ఉద్యోగుల అవస్థలు వర్ణణాతీతంగా మారాయి. మరుగుదొడ్లకు ఏకంగా తాళాలను వేసేయడంతో మహిళా ఉద్యోగులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారు. కారణాలు తెలియకపోగా...కార్యాలయ అధికారులకు పలుమార్లు విన్నవిస్తున్నా...పురుషుల టాయిలెట్లను వినియోగించుకోండని పరుషంగా సమాధానాలు వస్తున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా డీఎంహెచ్ ఓ కార్యాలయంలో మహిళా టాయిలెట్లకు తాళాలు తీయించాలని మహిళా ఉద్యోగులు కోరుతున్నారు. గ్రౌండ్ ఫ్లోర్, మొదటి ఫ్లోర్‌లో కూడా ఇదే పరిస్థితి ఉందని, ఎక్కడా మరుగుదొడ్లు వినియోగానికి పనికిరాని విధంగా తయారయ్యాయని, అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

– అరసవల్లి



డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో తాళాలు వేసిన మహిళల టాయిలెట్

పూరీ రథయాత్రకు ప్రత్యేక రైళ్లు



పూరీలో నిర్వహించనున్న జగన్నాథ స్వామి రథయాత్రకు శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) మీదుగా ప్రత్యేక రైళ్లు నడిపించేందుకు రైల్వే అధికారులు చర్యలు చేపట్టినట్లు శ్రీకాకుళం రోడ్ రైల్వే అధికారులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన 08445 నంబర్ గల రైలు జగదల్‌పూర్ నుంచి పూరీ వరకు ప్రయాణించనుంది. ఈ రైలు విజయనగరం మీదుగా శ్రీకాకుళం రోడ్‌ను కలుపుకుంటూ ప్రయాణిస్తుందని తెలిపారు. మళ్లీ 28వతేదీన పూరీలో బయల్దేరి 08446 నంబర్‌గల విశాఖపట్నం–పూరీ– విశాఖపట్నం రైలు శ్రీకాకుళం మీదుగా ప్రయాణిస్తుందని పేర్కొన్నారు. అలాగే జూన్ 27, 28, జూలై 5, 6 తేదీల్లో 08314 నంబరు గల ప్రత్యేక రైలు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ రైలు శ్రీకాకుళం రోడ్ (ఆమదాలవలస)కు ఉదయం 2.51 గంటలకు చేరనుందని తెలిపారు. ఈ రైలు కోటబొమ్మాళి, పలాస, మందస, సోంపేట, ఇచ్ఛాపురం స్టేషన్‌లలో ఆగుతుందని వివరించారు.

–ఆమదాలవలస

27న రెవెన్యూ సదస్సు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల అభ్యంతరాలను నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారంపై జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రెవెన్యూ శాఖలో సర్వీస్ లెవల్ అగ్రిమెంట్ (ఎస్ ఎల్ ఏ) కాలపరిమితి దాటి పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. టెక్కలి, గార, నందిగాం, రణస్థలం వంటి మండలాల్లో ఎస్ఎల్ఏ దాటి పెండింగ్ కేసులు ఎక్కువగా ఉన్నాయని కలెక్టర్ గుర్తించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి సమగ్ర ప్రణాళికను రూపొందించేందుకు జూన్ 27న రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రకటించారు. ఈ సదస్సులో పెండింగ్ కేసుల పరిష్కారానికి ఒక టైమ్ ఫ్రేమ్‌ను విధించి, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ బి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

జూలై 5న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ లోక్ అదాలత్‌ను జూలై 5న నిర్వహించనున్నామని, ఇందులో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, బీమా న్యాయవాదులు, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసారి కూడా ఎక్కువ కేసులు పోలీసు వారి దగ్గర నుంచి రావాలని కోరారు. కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కర రావు, 3 వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4 వ అదనపు జిల్లా జడ్జి ఎస్ ఎం ఫణి కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం .శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

28న జెడ్పీ సర్వసభ్య సమావేశం

అరసవల్లి: జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 28న జిల్లా పరిషత్ సమావేశమందిరంలో ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహించనున్నట్లుగా జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా ప్రకటనలో తెలియజేశారు. ఉమ్మడి జిల్లాలో అన్ని ప్రభుత్వ శాఖాధికారులు తప్పనిసరిగా సమావేశానికి హాజరుకావాలని, అలాగే తాజా ప్రగతి నివేదికలను జెడ్పీకి సమర్పించుకోవాలని కూడా సూచించారు.

డిగ్రీ 2, 4 సెమిస్టర్ల స్పెషల్ డ్రైవ్ పరీక్షలు ప్రారంభం



డిగ్రీ స్పెషల్ డ్రైవ్ పరీక్షలను పరిశీలిస్తున్న ఆచార్య బి.అడ్డయ్య

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయంలో 2015–18 విద్యా సంవత్సరంలో సీబీఎస్ విధానంలో చదివి డిగ్రీ పూర్తి చేయలేకపోయిన వారికి, 2019లో డిగ్రీలో చేరి ఏవైనా సబ్జెక్టులు ఉండిపోయిన సప్లిమెంటరీ విద్యార్థులకు సంబంధించి రెండు, నాలుగు స్పెషల్‌డ్రైవ్ పరీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రతి రోజు జరిగే ఈ పరీక్షలు వచ్చే నెల 7వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన పరీక్షలను రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య పరిశీలించారు.

ఇలా అయితే పిల్లల్ని పంపించం



ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

మండల కేంద్రంలోని నందికొండ కాలనీ ప్రాథమిక పాఠశాలలో 42 మంది విద్యార్థులు ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయుల్లో ఒకరిని అకారణంగా బదిలీ చేశారని, మళ్లీ ఉపాధ్యాయుడిని నియమించే వరకు తమ పిల్లల్ని పాఠశాలకు పంపించబోమని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ మండ సుదర్శనరావు తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. విద్యార్థులు అధికంగా ఉన్నచోట ఉపాధ్యాయులను తగ్గించి, పిల్లలు లేని చోట్ల నియామకం చేసి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ తీరు వల్ల పిల్లలు ప్రైవేటు విద్యా సంస్థలకు వెళ్లిపోతున్నారని పేర్కొన్నారు. అధికారులు పునరాలోచన చేసి ఉపాధ్యాయుడిని నియమించేవరకు తమ పిల్లలను పాఠశాలకు పంపించబోమని స్పష్టం చేశారు. అనంతరం ఎంఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు.

–సరుబుజ్జిలి

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



గాయపడిన వెంకటరమణ

టెక్కలి రూరల్: స్థానిక ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎం.వెంకటరమణ అనే తాపీమేస్త్రి మంగళవారం ఉదయం రైలు నుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. పర్లాఖిమిడి నుంచి టెక్కలి వచ్చేందుకు గుణ్‌పూర్–పూరీ పాసింజర్ రైలులో వస్తుండగా లింగాలవలస సమీపంలోని లక్ష్మీపురం వద్ద ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తీసుకెళ్లి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు వివరాలు సేకరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కంచిలి: సోంపేట రైల్వేస్టేషన్ ఆవరణలో రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సమాచారం అందుకున్న పలాస జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడు నలుపు టీషర్టు, నీలం జీన్స్ ప్యాంట్ ధరించాడని, సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉండవచ్చని పలాస జీఆర్‌పీ హెచ్‌సీ ఎం.సోమేశ్వరరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించామని, వివరాలు తెలిసిన వారు పలాస జీఆర్‌పీ స్టేషన్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈలకు వర్క్‌షాపు రేపు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): యువతకు స్వయం ఉపాధి అవకాశాలను పరిచయం చేసేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో జూన్ 26న ఉదయం 10.30 గంటలకు నరసన్నపేటలోని శ్రీరామ సత్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఫంక్షన్ హాలులో అవగాహన సదస్సు నిర్వహించనున్నారు. డీఐసీ, ఏపీఎస్ఎఫ్‌సీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ వర్క్‌షాప్‌లో పారిశ్రామిక ప్రోత్సాహకాలు, వివిధ పాలసీలు, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ వివరాలు అందించనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీధర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులకు ఈ వర్క్‌షాప్ ఉపయుక్తంగా ఉంటుందని, కార్యక్రమంలో ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ అకౌంట్ వివరాలతో హాజరైన వారు ఉచితంగా రిజిస్ట్రేషన్ పొందవచ్చని, ఈ అవకాశాన్ని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వినియోగించుకోవాలని శ్రీధర్ కోరారు.

పోయిన డబ్బులు తిరిగొచ్చాయి!



ఖాతాదారుకు పాస్ పుస్తకాన్ని అందజేస్తున్న తపాలాశాఖ అధికారులు

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం నగరానికి చెందిన సూరపు కృష్ణవేణి అనే సీనియర్ సిటిజన్ తన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.3లక్షలు పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాలో జమ చేసేందుకు బ్యాంక్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించారు. సాంకేతిక కారణాలతో ఆ నగదు చిత్తూరుకు చెందిన ఓ వ్యక్తి అకౌంట్‌లో జమయ్యింది. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్ అధికారులు, డివిజనల్ ఆఫీస్ అధికారులు సకాలంలో స్పందించి సీఈపీటీ ద్వారా ఆ నగదును కృష్ణవేణి అకౌంట్‌లోకి తిరిగి జమ చేయించారు. పోయిన డబ్బులు తిరిగి వచ్చినందుకు ఖాతాదారు మంగళవారం పోస్టల్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ పడాల రంగారావు, అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ నూలు భానోజీరావు పాల్గొన్నారు.

పరిహారం కోసం..

ఎన్నాళ్లీ ఎదురుచూపులు?

- ఆఫ్‌షోర్ నిర్వాసితులపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- 33 రోజులుగా దీక్షలు చేస్తున్న మెళియాపుట్టి మండల నిర్వాసితులు
- పరిహారానికి నోచుకోని 132 కుటుంబాలు
- 240 మందికి అందని యూత్ ప్యాకేజీలు



మెళియాపుట్టి మండలం చీపురుపల్లిలో నిరాహార దీక్షచేస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్వాసితులు

మెళియాపుట్టి : జిల్లా అభివృద్ధిలో భాగంగా భూములు, ఇళ్లు, గ్రామాలను సైతం త్యాగం చేసిన నిర్వాసితులు నేడు రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నా ప్రభుత్వం నుంచి కనీస స్పందన కరువైంది. కుటుంబాలతో కలిసి నెల రోజులకు పైగా నిరాహార దీక్షలు చేస్తున్నా కూటమి పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో నిర్వాసితుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. పలాస మండలం రేగులపాడు వద్ద దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో చేపట్టిన ఆఫ్‌షోర్ ప్రాజెక్టు కోసం సరిహద్దులో ఉన్న మెళియాపుట్టి మండలంలోని చీపురుపల్లి, దాసుపురం, నవర చీపురుపల్లి గ్రామాల నిర్వాసితులు సర్వం త్యాగం చేశారు. వీరితో పాటు టెక్కలి, నందిగాం మండలాలకు చెందిన పలు గ్రామాల నిర్వాసితులకు న్యాయపరంగా ప్యాకేజీలు అందించాల్సి ఉన్నా పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పాలకులు మారుతున్నా తమకు న్యాయం జరగకపోవడంతో ఈ ఏడాది మే 22న మెళియాపుట్టి మండలం చీపురుపల్లిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. నేటికి 33 రోజులైనా స్పందించే వారే కరువయ్యారని నిర్వాసితులు వాపోతున్నారు.

ఎన్నాళ్లో ఈ ఎదురుచూపులు..

ఈ ప్రాంతంలో అర్హులైన 132 మందికి నేటికీ పరిహారాలు అందలేదు. గ్రామంలో 14.55 ఎకరాల డి–పట్టా భూములకు సైతం పరిహారం చెల్లించలేదు. అంతేకాకుండా సుమారు 240 మంది యువతకు యూత్ ప్యాకేజీలు అందాల్సి ఉంది. 360 కుటుంబాలకు 5 సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. హిరమండలం నిర్వాసితులకు జీవో 460 ప్రకారం పూర్తిస్థాయి ప్యాకేజీలు ఇవ్వాల్సి ఉన్నా చెల్లింపుల్లో తేడాలు జరిగాయని, వాటిని సవరించి ఇళ్లకు సంబంధించి పరిహారం ఇవ్వాలని గ్రామానికి చెందిన యవ్వారి ఈశ్వరరావు, నందిగాం జగన్నాయకులు, గుమ్మడి మల్లేసు, నందిగాం హేమలత, చిన్నమ్మి, కొక్కిరి కిరణ్, ఉమాశంకర్, వెంకటరమణ తదితరులు డిమాండ్ చేస్తున్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తూ..

పాలకుల స్పందన కరువు..

పరిహారం విషయమై నిర్వాసిత గ్రామాల్లో ద్విచక్ర వాహనాలతో ర్యాలీ చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు సైతం నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అయినప్పటికీ వారి సమస్యలు పరిష్కారం కాలేదని నిర్వాసిత కుటుంబీకులు చెబుతున్నారు. ఇప్పటికైనా మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్పందించి న్యాయం చేయకపోతే పోరాటాలు మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేస్తున్నారు.

వలస కూలీనంటూ..



ఇద్దరు పిల్లలతో కలిసి కాలం వెల్లదీస్తున్నాను. వలస కూలీగా ఉన్నానంటూ అధికారుల తప్పుగా నమోదు చేయడంతో ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదు. పరిహారం కోసం అధికారులు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి పరిహారం ఇప్పించాలి.

– ఇప్పిలి వరలక్ష్మి, చీపురుపల్లి, మెళియాపుట్టి మండలం

ఎలా బతకాలి?



ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసి గ్రామాలను విడిచి బయట బతుకుతున్నాం. నా కుటుంబానికి ఒక్కపైసా ప్యాకేజీ రాలేదు. నాకు ముగ్గురు పిల్లలు. నిర్వాసితుడినైనా పరిహారానికి నోచుకోలేదు. ఇలాగైతే ఎలా బతకాలి? న్యాయం కోసం దీక్షలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

– నందిగాం భాస్కరరావు, చీపురుపల్లి, మెళియాపుట్టి మండలం

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ఇచ్ఛాపురం టౌన్ : మండపల్లి గ్రామంలో ఈ నెల17న జరిగిన బర్రి గంగయ్య హత్య కేసులో నిందితుడు పాతిర్ల దాశరథిరెడ్డి(దాసు)ని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇచ్ఛాపురం సీఐ చిన్నమనాయుడు విలేకరులకు వివరాలు వెల్లడించారు. మండపల్లికి చెందిన బర్రి గంగయ్య కుమార్తె డిల్లమ్మకు అదే గ్రామానికి చెందిన పాతిర్ల దాశరథి రెడ్డితో 2014లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. దాశరధి మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోకపోవడంతో పిల్లలతో కలిసి భార్య కన్నవారింటికి వెళ్లిపోయింది. ఈసారి సక్రమంగా చూసుకుంటానని, డ్యూటీకి వెళ్లేందుకు బైక్ కావాలని చెప్పగా భార్య డ్వాక్రా సంఘంలో రూ.ఐదు వేలు అప్పుచేసి ఇచ్చింది. మళ్లీ ఎప్పటిలాగే మద్యానికి బానిసై భార్యాపిల్లలను పట్టించుకోకపోవడంతో డిల్లమ్మ మరలా పుట్టింటికి వెళ్లిపోయింది. ఏడాదిగా కన్నవారింటిలో డిల్లమ్మ ఉండటంతో దాశరథి తన మామ గంగయ్యతో ఈ నెల 17న గొడవకు దిగాడు. అనంతరం గంగయ్య సైకిల్‌పై వెళ్తుండగా గ్రామ సచివాలయం సమీపంలో కత్తితో పొడిచి పరారయ్యాడు. గంగయ్య మృతి చెందడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టి మంగళవారం లోద్దపుట్టి సమీపంలో దాశరథిని అరెస్టు చేశారు.



పట్టుబడిన నిందితుడితో పోలీసులు

ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విజయవాడలో రాష్ట్ర సచివాలయం ఉన్నందున శ్రీకాకుళం జిల్లా ప్రజలు రాకపోకలు చేసేందుకు ఇచ్ఛాపురం నుంచి విజయవాడకు ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే సలహా మండలి బోర్డు సభ్యుడు డాక్టర్ బుడుమూరు రాజేష్ కోరారు. విశాఖపట్నం డివిజనల్ రైల్వే మేనేజర్‌తో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ శ్రీకాకుళంలో రాత్రి బయలుదేరి విజయవాడలో ఉదయం దిగేలా, తిరిగి విజయవాడలో రాత్రి బయలుదేరి ఇచ్ఛాపురం ఉదయం చేరుకునేలా సౌకర్యం కల్పించాలని విన్నవించారు. దీనికి డివిజనల్ మేనేజర్ అంగీకరించినట్లు తెలిపారు.



రైల్వేబోర్డు సమావేశంలో బుడుమూరు రాజేష్

ఆర్మీ లెఫ్టినెంట్‌కు సన్మానం

ఇచ్ఛాపురం రూరల్: ఈ నెల 16న ఆర్మీలో లెఫ్టినెంట్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆశి సంతోష్ కుమార్‌రెడ్డిని గ్రామస్తులు మంగళవారం ఘనంగా సత్కరించారు. లెఫ్టినెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి స్వగ్రామానికి విచ్చేయడంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన ఇచ్ఛాపురం ఇన్‌చార్జి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు, తిప్పన దుర్యోధనరెడ్డి, సంతోష్‌కుమార్, తారక్, ప్రతాప్, కాశీ, కృష్ణమూర్తి, కిరణ్, ప్రభాకర్, యువత పాల్గొన్నారు.



సంతోష్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న గ్రామస్తులు

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ, పీజీ (ఆర్ట్స్)కళాశాలలో వివిధ విభాగాల్లో ఖాళీ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీలతో భర్తీ చేయనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ కణితి శ్రీరాములు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. బయోటెక్నాలజీ యూజీ విభాగంలో ఒక పోస్టు, ఎమ్మెస్సీ మెడికల్ బయోటెక్నాలజీలో రెండు పోస్టులు, కంప్యూటర్ సైన్స్‌లో మూడు పోస్టులు ఖాళీ ఉన్నట్టు వివరించారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ పూర్తిచేసిన వారు అర్హులని, నెట్/సెట్ కలిగి, ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం కలిగిన వారికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌ఓడీలు డాక్టర్ ఎం.ప్రదీప్ (8555911961), బి.రఘురామ్ (8886003083) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

కలెక్టర్, ఎస్పీలకు ప్రశంసలు



కలెక్టర్, ఎస్పీలను అభినందిస్తున్న సీఎం, డిప్యూటీ సిఎం

శ్రీకాకుళం పాతబస్టాండ్ : సముద్ర తీరప్రాంత గ్రామమైన పెద్దగనగళ్లవానిపేటలో ఈ నెల 21న నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో ఆరు వేల మందికిపైగా మత్స్యకారులు పాల్గొని యోగాసనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో నమోదైంది. ఈ నేపథ్యంలో విజయవాడలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిలను అభినందించారు.

తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉద్దానంలో కొబ్బరి పంటలో వ్యాప్తి చెందిన తెల్ల దోమ నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ పూడి కిరణ్‌కుమార్ మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురం, వజ్రపుకొత్తూరు, పలాస, మందస మండలాల్లో తెల్లదోమ వల్ల కొబ్బరిపంట దిగుబడి తగ్గి రైతులు పూర్తిగా నష్టపోతున్నారని చెప్పారు. వీటిపై పరిశోధన చేయించి ఉద్దాన ప్రాంత రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెల్లదోమపై ప్రభుత్వం డ్రోన్ ద్వారా మందులు చల్లాలని విన్నవించారు.

బంగారమ్మ తల్లి హుండీలో చోరీ



ధ్వంసమైన హుండీ

ఎల్.ఎన్.పేట : లక్ష్మీనర్సుపేట వద్ద వంశధార నదీ తీరంలో ఉన్న బంగారమ్మ తల్లి ఆలయంలో హుండీ చోరీకి గురైంది. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హుండీని ధ్వంసం చేసి నగదు, కానుకలు దొంగిలించుకుపోయారని సర్పంచ్ ముగడ దివాకరనాయుడు తెలిపారు. మంగళవారం ఉదయం భక్తులు ఆలయానికి వెళ్లేసరికి చోరీ జరిగినట్లు గుర్తించడంతో సరుబుజ్జిలి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన



రణస్థలంలో ధర్నా చేస్తున్న గ్రామ సచివాలయ ఉద్యోగులు

రణస్థలం: గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం రణస్థలంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగుల బదిలీలు, రేషనలైజేషన్‌కు సంబంధించిన జీఓ 5 పునఃపరిశీలించి సొంత మండలాల్లోనే పోస్టింగులు ఇచ్చేలా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశాకే బదిలీలు చేపట్టాలన్నారు. మిగులు ఉద్యోగులను ఎక్కడ నియమిస్తారో స్పష్టత ఇవ్వాలని కోరారు. సచివాలయ ఉద్యోగులందరికి ప్రమోషన్ చానల్ కల్పించాక రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. జాయినింగ్ తేదీ నుంచి సర్వీసును పరిగణనలోకి తీసుకుని రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని కోరారు. ఆలస్యంగా ప్రొహిబిషన్ ప్రకటించినందుకు తొమ్మిది నెలల ఎరియర్స్ మంజూరు చేయాలన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడులు వీరికి సంఘీభావం తెలిపారు. అనంతరం ఎంపీడీవో ఎం.ఈశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్)కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాలో 189 మంది అభ్యర్థులు వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కళాశాలలో నోడల రిసోర్స్ సెంటర్, జవహర్ నాలెడ్జ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ సొల్యూషన్స్ సంస్థ నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు జిల్లా నలుమూలల నుంచి 298 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వివిధ పరీక్షల అనంతరం 189 మందిని ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కింతలి సూర్యచంద్రరావు తెలిపారు. కార్యక్రమంలో జేకేసీ కో–ఆర్డినేటర్ శ్రీలక్ష్మి, కెరీర్ సొల్యూషన్స్ మేనేజర్ ప్రేమ్‌కుమార్, డాక్టర్ ఎస్.వాణికుమారి, డాక్టర్ ఎస్.రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

విద్యార్థులకు డీఈఓ అభినందనలు

మందస : సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నాత పాఠశాలలో పదో తరగతి చదివి ట్రిపుల్ ఐటీకి ఎంపికైన బాబ శ్రీజ, భాగ్యలక్ష్మి పాణిగ్రాహి, మట్ట హర్ష, డొక్కరి మాధవిలను డీఈఓ తిరుమల చైతన్య అభినందించారు. మంగళవారం పాఠశాలను సందర్శించారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన జె.నిహారిక, వై.మధుప్రియలను కూడా అభినందించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుందర్ సాల్మన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో డీఈఓ, ఉపాధ్యాయులు

జనశక్తి నేత సాంబశివరావు మృతికి సంతాపం

పలాస: బొడ్డపాడులో నివాసముంటున్న సి.పి.ఐ.ఎం.ఎల్ (జనశక్తి) పార్టీ నాయకుడు మార్పెల్ల సాంబశివరావు(70) అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం విప్లవ సంప్రదాయం ప్రకారం భౌతికకాయంపై ఎర్రజెండాను కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం బొడ్డపాడు కాలనీలోని స్వగృహం వద్దే సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ గుంటూరు జిల్లా తెనాలికి చెందిన సాంబశివరావు ఆర్టీసీలో మెకానిక్‌గా పనిచేసి విప్లవోద్యమానికి ఆకర్షితుడై ఉద్యమ అవసరాల కోసం బొడ్డపాడు చేరుకున్నారని, గ్రామానికి చెందిన పి.రాజేశ్వరిని వివాహం చేసుకొని ఇక్కడే స్థిరపడ్డారని తెలిపారు. ఉమ్మడి జనశక్తిపార్టీ, అనంతరం సి.పి.ఐ.ఎం.ఎల్ న్యూడెమొక్రసీ పార్టీలో పనిచేసిన సాంబశివరావు కొద్దిరోజులు పాతపట్నంలో జైలు జీవితం అనుభవించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు తామాడ సన్యాసిరావు, పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, రాపాక చిరంజీవి, కుత్తుం దుష్యంతు, పోతనపల్లి మురళి, కోనేరు గురయ్య, మురిపింటి గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



సంతాపం తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వజ్రపుకొత్తూరు/టెక్కలి రూరల్ : పూండి రైల్వే అండర్ పాసేజ్ సమీపంలో మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. గోవిందపురం గ్రామానికి చెందిన గుంట చంటి స్కూటీపై పూండి బస్టాండ్‌కు వెళుతుండగా ఎదురుగా అతివేగంతో బైక్‌పై వస్తున్న మెళియాపుట్టి మండలం కంజాలకు చెందిన శివ అనే యువకుడు ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఇద్దరూ గాయపడటంతో స్థానికులు స్పందించి 108 అంబులెన్సులో టెక్కలి ఏరియా ఆసుపత్రికి తరలించారు. చంటి పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. ఫిర్యాదు అందిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని వజ్రపుకొత్తూరు ఎస్ఐ బి.నిహార్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన చంటి

పశువుల వాహనం పట్టివేత

కంచిలి: దాకరాపల్లి గ్రామానికి చెందిన రాజా ప్రధాన, బొట్ట కాళిదాసు, డొక్కర పురుషోత్తంలు రావివలస సంతకు పశువులను వ్యాన్‌లో తరలిస్తుండగా కంచిలి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న 11 పశువులను స్వాధీనం చేసుకున్నారు. కంచిలి ఎస్ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏఓబీలో సారా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న సారా తయారీ సామగ్రితో ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు

- 1,520 లీటర్ల సారా స్వాధీనం

పాతపట్నం: ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో అక్రమంగా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై ఆంధ్ర, ఒడిశా ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మంగళవారం దాడులు నిర్వహించారు. పాతపట్నం, మెళియాపుట్టి, కొత్తూరు మండలాలకు ఆనుకుని ఉన్న ఒడిశా గ్రామాలైన శిరడా, గురిసింగిగూడ, కొత్తగూడ, దిద్దిన గూడ, తమిళగూడ పరిసరాల్లో 1,520 లీటర్ల సారా, 7,700 లీటర్ల బెల్లం ఊటలను గుర్తించి ధ్వంసం చేశారు. తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీ, విక్రయాలు చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కోట కృష్ణారావు హెచ్చరించారు. ఈ దాడుల్లో గజపతి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రదీప్ కుమార్ సాహూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ ఎం.శ్రీనివాసరావు, పాతపట్నం, కొత్తూరు, పలాస, శ్రీకాకుళం, పలాస టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.